
# ధర్మో రక్షతి


## పెద్దిభొట్ల సుబ్బరామయ్య

**జీవితంలో ఎవరెప్పుడు తారసపడతారో ఎవరెప్పుడు విడిపోతారో వూహించలేము ఎవ్వరమూ...**



కొన్ని పరిచయాలు కారు మబ్బులతో నిండిన ఆకాశాన్ని చీల్చుకొని క్షణకాలం మెరిసే తటిల్లతలాగా మురిపించి మాయమవుతాయి. మరికొన్ని పరిచయాలు వుండి వుండి మెరిసి మరింత మురిపిస్తాయి. కొన్ని పరిచయాలు స్నేహాలుగా మారి చిరకాలం పసందు చేస్తాయి. మరికొన్ని పరిచయాలు మాత్రం అగాధ జలరాశి వంటి మనో గర్భంలో ఏ మూలనో గుప్తంగా వుండిపోతాయి. ఎన్నటికీ పైకి తేలక బాధిస్తాయి. ఈ ఉపోద్ఘాతం అంతా ఆ బాధ, ఆ మురిపెం ఇతరులతో పంచుకోడానికే....

మండే ఎండాకాలంలో ఒకనాటి అపరాహ్ణ సమయంలో ఆ నిర్జనమైన బాట వెంట నడుస్తున్నాను. ఆకాశంలో పరమ నిరంకుశుడివలె సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. గాలి వేడిగా బాణ వేగంలో వీస్తున్నది. పక్షులు, పురుగులు కూడా బయటకు తిరగలేక ఎక్కడెక్కడో నీడపట్టున తలదాచుకుని వున్నట్టున్నాయి. ఇక మానవ మాత్రుల విషయం చెప్పేదేముంది? అంత ఎండలో బాట వెంట అక్కడక్కడ వున్న చెట్ల నీడలలో ఆగుతూ మళ్లీ ముందుకు సాగుతూ ప్రయాణిస్తున్నాను. మరో రెండు మైళ్లు సాగితే కాని నా గమ్యం రాదు. అప్పుడు జరిగిందొక విచిత్రం. ముందు నుంచి అమిత వేగంతో ఒక చిన్న మోటారు సైకిలు దూసుకుపోయింది. నేను వెనుదిరిగి చూస్తూ నిలబడ్డాను. ఆ చిన్న వాహనం నన్ను దాటి ముందుకు వెళ్లిపోయింది. నేను చూస్తూ వుండగానే ఆ మోటారు సైకిలు వెనుక నుంచి




ఏదో చేతి సంచి జారిపోయి రోడ్డు మీద పడింది. ఆ వ్యక్తి అదేమీ గమనించకుండా వేగంగా ముందుకు వెళ్లిపోయాడు.

నేను వెనుదిరిగి నడిచి వెళ్లి చూద్దును కదా, అది ఒక చేతి సంచి. కుతూహలంతో దాన్ని తీసుకొని చెట్టు కిందకి చేరి చూస్తే దాని నిండా నోట్ల కట్టలు... వేలాది రూపాయలు... బహుశా లక్షలు... నేను నివ్వెరపోయి బొమ్మలాగా కూర్చుండిపోయాను. గొంతెత్తి పెద్దగా అరుద్దామంటే ఆ మనిషి అప్పటికే కనుమరుగై మాయమైపోయాడు. క్షణాలు, నిమిషాలుగా మారి కాలం కరిగిపోతున్నది. నా ముందు రెండు మార్గాలు స్ఫురించాయి. మొదటిది ఈ సంచి తీసుకొని త్వరత్వరగా నా దోవన నేను పోయి ఆ ఆయాచిత నిధిని సొంతం చేసుకోవడం... ఆ ఆలోచన స్ఫురించగానే నాలో నేను నవ్వుకున్నాను. నలుగురికీ ముఖ్యంగా యువతకు ధర్మం బోధించి తీర్చిదిద్దే అధ్యాపక వృత్తిలో చిరకాలంగా స్థిరపడిన నాకు రాదగిన ఆలోచనే కాదు అది. రెండో మార్గం ఉత్తమం. అక్కడే కాస్సేపు వేచి చూసి ఎంతకూ ఎవరూ రాకపోతే నా గమ్యం చేరుకొని పోలీసు స్టేషన్‌లోనో, ఏ మేజిస్ట్రేటుకో ఆ సంచి వున్నది వున్నట్లుగా అప్పజెప్పి ఇంటికి పోవడం...

అలాగే కూర్చున్నాను క్షణాలు లెక్కించుకుంటూ...

కొద్దిసేపటికి దూరం నుంచి వస్తూ ఆ చిన్న మోటారు సైకిలు మళ్లా కనిపించింది. దగ్గరయ్యే కొద్దీ ఆ మనిషి స్పష్టంగా కనిపించాడు. పెద్ద వయసు వాడేమీ కాదు. అతిదీన వదనంతో బాటకు అటూ ఇటూ చూస్తూ దిగులుగా ముందుకు వస్తున్నాడు. నా దరికి రాగానే బండి ఆపి నా వంక జాలిగా చూశాడు. ఏదో మాట్లాడబోయాడు. నేను అంతలో అంతవరకూ నా వెనుక దాచి వుంచిన అతని చేతి సంచి ఇవతలకి తీసి అతనికి చూపించాను. అతడు ఒక్క ఉదుటున బండి స్టాండు వేసి దిగి విప్పారిన ముఖంతో నోట మాట రానివాడిలా ఆ సంచి తీసుకొని అసంకల్పితంగా జిప్ తెరిచి చూసుకొని అప్పుడు ఆకస్మాత్తుగా నా కాళ్ల మీద పడిపోయాడు.

సరే.... ఇంతవరకూ జరిగింది జరిగినట్లు చెప్పాను. ఆ తర్వాత కథలోనే వుంది అసలు చమత్కారం అంతా... అతడు ముందు తేరుకుని నా చేతులు పట్టుకొన్నాడు. ఇవి చేతులు కావు. ఇంకేవో అన్నాడు. తర్వాత కళ్ల నీళ్లు పెట్టుకొన్నాడు. ఆపైన సంతోషంతోనో దుఃఖంతోనో పూడుకుపోతున్న కంఠంతో చాలా మాట్లాడాడు. అంతా చేసి చివరకు 'మా ఇంటికి రావాల్సిందే మీరు... ఇప్పుడే... ఇలాగే'. ఇంటి దగ్గర అందరూ దిగులుపడుతున్నారు. ఎవరికీ ఆశ లేదు, ఈ డబ్బు మళ్లీ దొరుకుతుందని. పిల్ల పెళ్లి ఆగిపోయినట్లే అని ఏడుపులు... అన్నాడు. ఆ తర్వాత పరస్పర పరిచయాలు క్లుప్తంగా జరిగిపోయాయి. వాళ్లది సిటీ పక్కన చిన్న గ్రామం. మధ్యతరగతి కుటుంబం. పరువుమర్యాదలు అసలు సంపదగా భావించే ధార్మికవాదులు... కాస్త పొలమూ అమ్మి పిల్ల పెళ్లి తలపెట్టుకున్నారు. ఇంతలో ఇలా జరిగింది. అతడు స్థిమితపడి...

'మా ఇంటికి రావాల్సిందే మీరు... ఇప్పుడే... ఇప్పుడే.... మా వాళ్లందరికీ కనిపించాలి' అని పట్టుపట్టి కూర్చున్నాడు.

'సరే... ఎండవేళ... ఇదీ బాగానే వుంది' అనుకుని సిద్ధపడ్డాను. ఆ చిన్న వాహనం మీద వెనుక సీటు మీద ఆసీనుడనైనాను.

పెంకుటిల్లు.... ముందు వరండాలో ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు మరో ఇద్దరు పిల్లలు ఒక ముసలాయన అమితంగా వ్యాకులపడుతూ కూర్చుని వున్నారు. మేము వెళ్లేసరికి ఒక్కసారిగా అలజడి...

'ఏమయ్యింది? ఏమయ్యింది'

'అమ్మయ్య! దేవుడు రక్షించాడు'

'ఎంత బెంగపడ్డాము... ఈ కాలంలోనూ ఇలాంటి మనుషులు... కూర్చోబెట్టి పూజ చేయాలి.

ఇలాంటి వాళ్లు ఇంకా అక్కడక్కడ వుండబట్టే ధర్మ దేవత ఒంటి కాలితోనైనా నడుస్తున్నది.' ఇలాంటి మాటలు...

చల్లని నీళ్లు... తాగాను. సేదదీరినట్టనిపించింది. బైట సూర్యతాపం కూడా కాస్త తగ్గినట్టున్నది.

ఈ సంరంభమంతా సద్దుమణిగిన తర్వాత అతడు 'రండి....లోపల మా పెద్దమ్మను చూద్దురుగాని' అన్నాడు.

నేను 'ఈ పెద్దమ్మ ఎవరు?' అనుకుంటూ అతన్ని అనుసరించాను.

పక్కగదిలో కిటికీ పక్కన మంచంలో పడుకుని వుంది ఆవిడ... పండిరాలిపోయేందుకు సిద్ధంగా వున్న జీర్ణపత్రంలా వుంది. ఈ విషయం తెలుసుకొని నన్ను చూద్దామని కుతూహలంతో కళ్లింతలు చేసుకొని చూస్తున్నది. కిటికీలో నుంచి సమృద్ధిగా ప్రజ్వలంగా పడుతున్న సూర్యకాంతి. ఆమె ముఖం మీద వెలుగులు చిమ్ముతున్నది. అమూల్యమైన చిత్ర కళా ఖండం మీద కాలపురుషుడు వెర్రిగా గీచిన గీతల వంటి ముడుతలు.... పచ్చని ముఖం మీద వెడల్పయిన కళ్లు...చూస్తూ నిర్విణ్ణుడనై నిలబడిపోయాను. ఆమె కూడా నన్ను చూస్తూనే నిర్నిమేషంగా వుండిపోయింది.

'నాకు ఏమీ కాని పెద్దమ్మ... నాకు పెద్దదిక్కు..' అన్నాడతను.

'ఏమీ కాదా?' అన్నాను నేను.

'ఏమీ కాదు ఎక్కడో దొరికింది. తీసుకొచ్చి పెంచుకుంటున్నాను' అంటూ నవ్వాడతను. మాటా పలుకూ లేదు. అవసరమైతే పలక

మీద రాసి చూపిస్తుంది. లేకపోతే మౌనవ్రతమే. అయిదారేళ్లు అయిందేమో... ఒకనాడు జోరుగా వాన కురుస్తూ వుండగా ఒక చిన్న వూళ్లో బస్టాండులో స్పృహతప్పి పడి వుంది. ఫెళ్లున జ్వరం. అక్కడ డాక్టరు దగ్గరకి తీసుకుపోయి నయం చేయించి వెంటబెట్టుకొచ్చాను. ఎక్కడిదో ఏమో ఏమీ తెలియదు. ఇప్పటికీ చెప్పలేదు'అన్నాడతను.

నేను ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాను. ఆమె కూడా అలాగే కళ్లార్పకుండా చూస్తూ వుండి తర్వాత శుష్కించిన చేతిని చాచి పలకందుకుంది. అతడు ఆశ్చర్యపోతూ బలపం అందించాడు. ఆ ముఖం నాకు బాగా పరిచితం. ఏళ్ల తరబడి నా మనసులో ముద్రితమైపోయి చెరిగిపోక నిలిచి వుండి గుర్తురాక నన్ను వేధిస్తున్న ముఖం. ఆ కళ్లు నిరంతరం నన్ను వెంటాడుతూ కాపాడుతున్నవే. ఇంత జీవితం ఇన్ని అనుభవాలు గడిచినప్పటికీ నన్ను విడిచిపోని ముఖం అది. చిరునవ్వు వీడని ముఖం. కారు మబ్బుల చాటున దాగిన వెన్నెల వెలుగు వంటి ఆ చిరునవ్వు ఎప్పుడైనా మరిచిపోయానా?

ఆమె నెమ్మదిగా పలక మీద వంకర టింకరగా అక్షరాలు రాసింది. 'నన్ను గుర్తు పట్టలేదా? నేను నిన్ను గుర్తుపట్టాను. చిచ్చుబుడ్డి నీ పేరు. నీ చీమిడి ముక్కులు... నీ చిన్నప్పటి చిర్రుబుర్రులు... నీ మంకుతనం.... నీ సున్నా మార్కులు.... మీ అమ్మ పెట్టే చీవాట్లు... మీ నాన్న చేసిన గారాబం... అన్నీ నాకు గుర్తే.... నీ చెవి పక్కన ఆ పుట్టుమచ్చ కూడా గుర్తే....

నన్ను ఇంకా గుర్తుపట్టలేదా? ఎంత అన్యాయం?'

నేను నివ్వెరపోయాను. అతడు కూడా ఆశ్చర్యంతో చూస్తూ నిలబడిపోయాడు. నేను తల అడ్డంగా వూపాను బాధపడుతూనే....

'పిచ్చీ... నేను... రాజీ... నీ రాజీ అక్కను...' నా తల తిరిగినంత పనయింది. ఎగిరిగంతేసినంత పని చేశాను. ఒక్కసారిగా ఆమె పక్కన కూర్చుని శుష్కించిన ఆ చేతులను నా చేతులలోకి తీసుకున్నాను. ఒక మాతృ హస్త స్పర్శ యొక్క అనుభవం కలిగి తన్మయుణ్ణయ్యాను. ఆమె కళ్లు నీటితో నిండాయి. మూతలు పడ్డాయి.

ఎప్పటి సంగతి ఇది! అప్పటి నా వయసు ఏ ఏడెనిమిదేళ్లో... ఇంకా తక్కువో. ఒకనాడు ఒక నడి వయస్సు స్త్రీ... చంకలో ఒక పసిపిల్ల... ఆమె కొంగు చాటున నిలబడి కళ్లు విప్పార్చి చూస్తున్న ఈ రాజీ... పన్నెండు పదమూడేళ్ల వయసుంటేదేమో... మగవాడు పోతే తిండికి గడవక ఇల్లిల్లూ తిరుగుతూ 'పని ఇప్పించమని' వేడికోలు... మా అమ్మ దయ తలిచి పనిలో పెట్టుకుంది. అప్పటినుంచి రాజీ నాకు అక్కగాని అక్క అయింది. రోగిష్టి మారి అమ్మ నా ఆలనాపాలనా చూడలేకపోతే ఈ రాజీ సమస్తమూ తానే అయి నన్ను పెంచింది. అలా మురిపెంగా రెండు నిండు సంవత్సరాలు గడిచాయి. ఒక దురదృష్ట దినాన మొత్తం తల్లకిందులైపోయింది. మా ఇంటికొచ్చిన ఒక బంధువు తన బంగారు గొలుసుపోయిందని గోలపెట్టింది. ఆ దొంగతనం ఈ తల్లీ కూతుళ్ల నెత్తిన పెట్టి నానా యాగీ చేసింది. దాంతో ఈ తల్లీ కూతుళ్లు గుడ్లనీరు కుక్కుకుంటూ పోలీసు స్టేషన్‌కు నడిచారు. ఆ తర్వాత ఆ బంధువు నగ దొరకడం, కేసు వాపసు తీసుకోవడం జరిగింది. కానీ ఆ తల్లీ పిల్లలు మళ్లీ మా ఇంటి ఛాయలకు కూడా రాలేదు. ఎటు పోయారో ఏమో తెలీదు. నేను కొంత కాలం బెంగపెట్టుకున్నాను. కానీ కాలం అన్నింటినీ మరిచిపోయేటట్టు చేసింది. కానీ ఆ కొద్దిపాటి కాలంలో రాజీ చూపిన ఆప్యాయత, నన్ను తోడబుట్టిన వాడిలాగా చూసుకున్న వైనం ఇప్పటికీ మరపునకు రాలేదు. చాలా సమయం గడిచినట్లుంది. ఆమె చెంతనే నేను... నా చేతిని విడవకుండా కళ్లు మూసుకొని ఆమె... అతడు మాత్రం వింతగా చూస్తూ అలా నిలబడిపోయాడు.


తర్వాత తేరుకొని నిలబడ్డాను. సంభ్రమంతో అతన్ని చూసి 'మంచి మేలు జరిగిందివ్వాళ. మీకూ నాకు కూడా. మీ ఇంటికి రావడం అదృష్టమే. మళ్లీ మళ్లీ వస్తూ వుంటాను. మీకు ఏమీకాని ఈమెను చేరదీసి కాపాడుతున్నారు. కొన్నాళ్లు ఆగి నేను తీసుకుపోయి పెంచుకుంటాను' అన్నాను.

'అది కుదరదు. ఈమె నా దగ్గర వుండాల్సిందే. ఎప్పటికీ' అన్నాడతను. కావలిస్తే మీరు వస్తూపోతూ వుండండి. అంతే! అని మళ్లీ లోగొంతుకతో 'ఎన్నాళ్లో గడవదనుకుంటాను సార్. మనిషి లోలోపల కుంగిపోతున్నది' అన్నాడు దిగులుగా....

నేను ఆమె వంక 'సెలవు వెళ్లొస్తాను' అన్నట్లు చూసి ఇవతలికి వచ్చాను. ఆమె కళ్లు మూసుకునే వుంది...

అందరికీ ఇంతమాత్రంలోనే ఆప్తుడనైపోయినట్టున్నాను. అతను నా అడ్రసు రాసుకున్నాడు. అందరికీ చెప్పి బయటకొచ్చాను. మళ్లీ నడక ప్రారంభించాను. ఇప్పుడు సూర్యుడి ప్రతాపం తగ్గింది. గాలి చల్లబడింది. జన సంచారమూ మళ్లీ మొదలైంది. హుషారుగా వేగంగా ముందుకి నడిచాను.

★



## ఎవర్‌గ్రీన్ ఆటో బయోగ్రఫీ!

ఎవర్‌గ్రీన్ హీరో దేవానంద్ కెరీర్‌లో కామాలే తప్ప ఫుల్‌స్టాప్‌లకు చోటే లేదు. స్వీట్ ఎయిటీస్‌లో కూడా మరో రెండు సినిమాలకు శ్రీకారం చుట్టాడు. అయితే అంతకంటే ముందు అరవయ్యేళ్ల సినీప్రస్థానంలో తనకు ఎదురయిన అనుభవాలను, అసలా ప్రస్థానం ప్రారంభించడానికి తాను పడ్డ కష్టాలను, ఇలా ఒకటేమిటి.... సినీ కెరీర్‌నంతటినీ ఆత్మకథగా గుదిగుచ్చి పుస్తకంగా తీసుకొచ్చే ప్రయత్నంలో బిజీబిజీగా వున్నాడు. దేవానంద్ బయోగ్రఫీని అచ్చువేయడానికి అంతర్జాతీయ స్థాయిలో పబ్లిషర్లు పోటీలు పడుతున్నారు. అయితే తక్కిన వాళ్లలాగా తాను మాత్రం కథ రాయడంలో ఎవరి సహాయమూ తీసుకోవడం లేదని, పూర్తిగా తన సొంత కథేనని, అందులోని ప్రతి అక్షరమూ, ప్రతిపదమూ ప్రతి పంక్తీ తను రాసిందేనని ఒక ఇంచుక గర్వంగా కూడా చెప్పుకున్నాడు. అందులో అతిశయోక్తి ఏమీ వుండదనీ, నిజాయితీగా రాశానని కూడా ఎంతో ఎమోషనల్‌గా చెబుతున్నాడు. దేవానంద్‌లాగే అతడి ఆత్మకథ కూడా ఎవర్‌గ్రీన్ కావాలని ఆశిద్దాం.